క్లుప్తంగా

ప్రశాంతంగా ఎంపీపీ సర్వసభ్య సమావేశం



ఆచంట మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

పెనుగొండ: ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఆక్వాజోన్, ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల లభ్యత, సాగునీరు, అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, వైస్ ఎంపీపీ లు యర్రగొప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, ఎంపీడీవో జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

పని చేసే వారికి ప్రజల్లో గుర్తింపు

యలమంచిలి: నిబద్ధతతో పని చేసే వారికి ప్రజల్లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని మేడపాడు మాజీ సర్పంచ్ అడ్డాల వాసుదేవరావు అన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేడపాడు శాఖలో బ్యాంకు మేనేజర్‌గా పని చేసి తణుకు శాఖకు బదిలీపై వెళ్లిన ఆకుల మహంకాళిరావును బుధవారం బ్యాంకు ఆవరణలో డ్వాక్రా సీఏలు, బ్యాంకు మిత్రలు, గ్రామ పెద్దలు, సిబ్బంది కలసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాడేపల్లి రామలక్ష్మి, మన్నే స్వప్న, చల్లా దేవి, నామన సాయికుమారి, టి హిమబిందు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య రాష్ట్ర కమిటీ సభ్యుడిగా బాబు

పాలకొల్లు అర్బన్: ఆర్యవైశ్య సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా పాలకొల్లుకి చెందిన అన్నదాన సమాజం చైర్మన్ మామిడి వెంకటేశ్వరరావు (బాబు)ను నియమించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోనాల శ్రీనివాస్ తనకు ఉత్తర్వులు అందజేశారని మామిడి బాబు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు మామిడి బాబును ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారిగా రాము

పెనుగొండ: ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారిగా పెనుగొండకు చెందిన గ్రంధి లక్ష్మీనారాయణ(రాము) నియమితులయ్యారు. ఈ మేరకు గ్రంధి రాము బుధవారం పెనుగొండలో విలేకరులకు వివరించారు.

21 నుంచి ఓట్ల వెరిఫికేషన్

పెనుగొండ: నియోజకవర్గంలో ఈ నెల 21 నుంచి 28 వరకూ ఓటర్ల వెరిఫికేషన్ జరుగుతుందని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జి.ఆదిశేషు తెలిపారు. బుధవారం ఆచంట తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఎల్ఓలు ఇంటింటికీ సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలు తనిఖీ చేస్తారని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ల ఎన్వీ సుబ్రహ్మణ్యం, గురుమూర్తి రెడ్డి, ఆర్వీ కృష్ణారావులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ రిటైర్డు సీడీపీఓ ఎలిజబెత్‌కు సత్కారం

పెనుమంట్ర: పెనుమంట్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణిగా పనిచేస్తూ ఇటీవల స్వచ్ఛంద పదవీవిరమణ చేసిన కాటం మేరీ ఎలిజబెత్ బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి మాట్లాడుతూ అధికారిణిగా మేరీ ఎలిజబెత్ నిస్వార్థసేవలు అందించి ఇటు ప్రజలతో పాటు అధికారులు ప్రజా ప్రతినిధులు మన్ననలు అందుకున్నారని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.పూర్ణబాబ్జి, ఎంఈఓ యు.నాగేశ్వరరావు, మార్టేరు, పెనుమంట్ర గ్రామ ఉపసర్పంచ్‌లు భూపతిరాజు శ్రీనివాసరాజు, కర్రి వేణుబాబు, సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆడపిల్లలను సమానంగా గౌరవించాలి

పాలకొల్లు అర్బన్: ఆడ పిల్లలను సమాజంలో చిన్న చూపు చూడకుండా వారిని పురుషులతో సమానంగా గౌరవించాలని ఆరోగ్య విస్తరణాధికారి కె.ప్రభాకర్ అన్నారు. పాలకొల్లు మండలం ఆగర్రు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం బేటీ బచావో బేటీ పఢావో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆడపిల్లను రక్షించు–ఆడపిల్లను చదివించు నినాదంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.గిరి పాల్గొన్నారు.

పంచభూత లింగాల ఏర్పాటు

పెనుగొండ: ఆచంట మృత్యుంజయ సొసైటీ చైర్మన్ వైట్ల శారదా దేవి జ్ఞాపకార్థం ఆచంట రామేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన పంచభూత లింగాలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ బుధవారం ఉదయం పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, ఈవో రామచంద్ర కుమార్, మనవర్తి విజయ్‌కుమార్, ట్రస్టీలు కోట వెంకటేశ్వరరావు, అడ్డాల సూర్యప్రసాద్, సత్యవరపు మధుసూధన్‌కోటి చుక్కల సుబ్బారావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ

ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు



శ్రీహరిపేటలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన నరసాపురం పట్టణంలోని 1వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారి, డ్రెయిన్ నిర్మాణ పనులకు ప్రసాదరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, వైస్ చైర్మన్ కొత్తపల్లి భుజంగరాయుడు, కౌన్సిలర్ సోమరాజు దుర్గా భవానీలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నరసాపురం నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజల ఇబ్బందులను గమనించి పురపాలక సంఘం సాధారణ నిధులు మంజూరు చేసి ఈ రహదారి, డ్రెయిన్ నిర్మాణ పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాల్ నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎక్కువ నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె వెంకటేశ్వరరావు, సోమరాజు భరత్, కావలి నాని తదితరులు పాల్గొన్నారు.

వరదల్లో బాధితులకు అండగా..



వరదల సమయంలో ఆహారం అందిస్తున్న వలంటీర్

గోదావరి వరదల్లో ఆచంట మండలం లంక గ్రామాల్లో వరద బాధితులకు వలంటీర్లు అండగా నిలిచారు. ఆకలితో అల్లాడుతున్న వరద బాధితులకు ప్రభుత్వం సహాయంతో పాటు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన ఆహారాన్ని 10 రోజులు పాటు అందించారు. 60 ఏళ్లకు పైగా లంకగ్రామాల్లో జీవిస్తున్నాం. గతేడాది వలంటీర్లు అందించిన సేవలు ఏనాడు చూడలేదు.

– ఎం.వెంకట్రావు, మర్రిమూల

వలంటీర్ ద్వారా ప్రయోజనం



గూట్ల సిబకు వేలిముద్ర స్కాన్ చేస్తున్న వలంటీర్

మా గ్రామ వలంటీర్ తండా సూరిబాబు వల్ల నాకు ఎంతో ప్రయోజనం కలిగింది. వైఎస్సార్ చేయూత అర్హత పొందగానే తన ఇంటికి వచ్చి వేలి ముద్రలు తీసుకున్నారు. ఇప్పటికి రెండు ప్రయోజనం పొందాను. మూడోసారి కూడా రాబోతుంది. అలాగే రేషన్ కార్డులో నుంచి మా కోడలు పేరు తప్పించి కొత్తగా రేషన్ కార్డు కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. త్వరలో మా పెదబాబు గూట్ల దయాకర్‌కి రేషన్ కార్డు కూడా రాబోతుంది.

– గూట్ల సిబ, శివదేవునిచిక్కాల

నేడు జగనన్న సురక్ష సభలు

మొగల్తూరు: మండలంలోని కాళీపట్నం పడమర, రామన్నపాలెం 2 సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహించనున్నారు. కాళీపట్నం పడమర సచివాలయ పరిధిలో తహసీల్దార్ జి.అనితా కుమారి, రామన్నపాలెం2 సచివాలయ పరిధిలో ఎంపీడీఓ వి.బాబ్జిరాజు పర్యవేక్షణలో గ్రామ సభలు నిర్వహిస్తారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని సగంచెరువులో బుధవారం మధ్యాహ్నం 2గంటలకు, తిల్లపూడిలో 3గంటలకు, భగ్గేశ్వరంలో 4గంటలకు జగనన్న సురక్షా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ గ్రామ సభలో లబ్ధిదారులు పాల్గొనాలని కోరారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలో వెలగలవారిపాలెం, పెనుమంట్ర–2 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష గ్రామ సభలు గురువారం ఉదయం జరుగుతాయని ఎంపీడీఓ పూర్ణబాబ్జి తెలిపారు. ఉదయం 10 గంటలకు వెలగలవారిపాలెం గ్రామసచివాలయం వద్ద, 11 గంటలకు పెనుమంట్ర –2 సచివాలయ పరిధిలోని సాయినాథ కల్యాణ మండపంలో ఈ సభలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సభలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు లబ్ధిదారులు పాల్గొనాలని కోరారు.

నరసాపురంలో డయల్ యువర్ డీఎం

నరసాపురం: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణీకులు అడిగిన పలు ప్రశ్నలకు డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్న రెడ్డి సమాధాన మిచ్చారు. గతంలో ఉండే నరసాపుం నుంచి విజయవాడ వయా మార్టేరు సర్వీసును, నరసాపురం శ్రీశైలం బస్సులను, తిరిగి పునరుద్ధరించాలని కోరగా కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చిన వెంటనే పరిశీలిస్తామని సమాధానమిచ్చారు. అయితే శ్రీశైలం బస్సు ప్యాసింజర్లు తగినంతగా లేకపోవడంతో రద్దు చేశామని సమాధానమిచ్చారు. నరసాపురం నుంచి మచిలీపట్నం మీదుగా విజయవాడ సర్వీసను నడపాలని కోరగా కొత్త బస్సులు వచ్చిన తర్వాత సర్వీసు నడుపుతామని హామీ ఇచ్చారు. అలాగే కార్గో సర్వీసులు పలు ప్రాంతాల్లో అందుబాటులో లేవని, సిబ్బంది సమయపాలన పైనా ఫిర్యాదులు రావడంతో ఆలోపాలను వెంటనే పరిష్కరిస్తామని డిపో మేనేజర్ సుబ్బన్నరెడ్డి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల పౌర్ణమికి అరుణాచలం గిరిప్రదక్షిణకు అనువుగా నరసాపురం నుంచి బస్సు సర్వీసు అందుబాటులో ఉందన్నారు.

మైనార్టీలకు అండగా సీఎం జగన్



పెనుగొండ ఎలక్ట్రికల్ వర్కర్స్‌యూనియన్ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ముస్లింలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధ వారం సిద్ధాంతం ముస్లిం సమస్యలపై ముస్లిం సోదరులు తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు చర్చించారు. ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి, కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూరుస్తామని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. సత్వరం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధుల మంజూరు

పెనుగొండ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు హామీ ఇచ్చారు. బుధవారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సంఘ సభ్యులు కలిసి నిధుల మంజూరుకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే స్థల కేటాయింపు చేశామని, భవన నిర్మాణానికి సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పెనుగొండ ఎంపీపీ పుతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, పోడూరు మండల కన్వీనరు పిల్లి నాగన్న, మండల ఎస్సీ సెల్ కన్వీనరు పలివెల శ్రీను, సిద్ధాంతం గ్రామ అధ్యక్షుడు జుత్తిగ దామోదర్, పార్టీ నాయకులు యాండ్ర శ్రీను, కేశరపల్లి రమేష్, మేడిచర్ల పండు, కోట వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు చీఫ్‌విప్ ముదునూరి షెడ్యూల్ ఇలా

నరసాపురం: ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు గురువారం ఉదయం 9.00 గంటలకు నరసాపురం మండలంలోని పెదమైనవానిలంక, 10.00గంటలకు వేములదీవి వెస్ట్ గ్రామ సచివాలయాలవద్ద జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ మేరకు ఆయన కార్యాలయ ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతరం 11 గంటలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2గంటలకు మొగల్తూరు మండలం కాళీపట్నం వెస్ట్, 3 గంటలకు రామన్నపాలెం గ్రామ సచివాలయాలవద్ద జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొంటారు. తదుపరి మధ్యాహ్నం 4 గంటలకు నరసాపురం పట్టణంలోని 16,17 సచివాలయాలకు సంబంధించి గాంధీనగర్ సచివాలయం వద్ద జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక లాభాలు



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ ఈదా అనిలకుమారి

నరసాపురం రూరల్: తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించే దిశగా రైతులను ఖరీఫ్ సాగుకు సమాయత్త చేయడమే పొలం బడి కార్యక్రమ లక్ష్యమని వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్‌కుమారి అన్నారు. బుధవారం నరసాపురం మండలం నవరసపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంవద్ద నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమంకోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుని వృద్ధిలోనికి రావాలన్నారు. ఆరోగ్యవంతమైన పైరు పెంచడం, మిత్రపురుగుల సంతతిని వృద్ధి చేసుకోవడంపై రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాచురల్ ఫార్మింగ్ సిబ్బంది నాగరాజు, ఏఈఓ ఇబ్బా లక్ష్మీనారాయణ, వీఏఏ సుధారాణి, రైతులు కృపాదానం, బాబూరావు, మల్లేశ్వరరావు, నెహ్రూబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలతో లబ్ధి



దొడ్డిపట్లలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: రాష్ట్రంలోని పేద వర్గాల ప్రజలందరికీ తన సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చుతున్న జగనన్న రుణం తీర్చుకోవడానికి సమయం ఆసన్నమవుతుందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ విమర్శించారు. దొడ్డిపట్ల గ్రామంలోని కేశవస్వామి ఆలయం ప్రాంగణంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష గ్రామ సభలో ఆయన మాట్లాడారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్రంలో 98 శాతం మంది ప్రజలకు చేరుకున్నాయన్నారు. సంతృప్తితో ఉన్న ప్రజలంతా మళ్లీ జగనన్నకు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యుడు మేకా శేషుబాబు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, చింతలపూడి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, ఎంపీపీ రావూరి వెంకటరమణ (బుజ్జి) వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, పార్టీ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, ఉచ్చుల స్టాలిన్, ఓదూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహకాలు

యలమంచిలి: జగనన్న పాల వెల్లువ కేంద్రాలకు పాలు పోసే పాడి రైతులకు ప్రభుత్వం అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తుందని మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. మండలంలోని మేడపాడు రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఆయన పాడి రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పాడి రైతులకు సబ్సిడీపై దాణా, గడ్డి విత్తనాలు ఇవ్వడమే కాకుండా వర్కింగ్ కేపిటల్ కింద సొసైటీల ద్వారా రూ.31 వేలు వడ్డీ లేని రుణాలు, సొసైటీల ద్వారానే పాడి పశువుల కొనుగోలుకు రూ.93 వేలు వడ్డీ లేని రుణాలు, డీఆర్‌డీఏ ద్వారా పాడి పశువులు కొనుగోలుకు రూ.లక్ష రుణం , పీఎంఈజీపీ పథకంలో రూ.3 లక్షలు నుంచి రూ.20 లక్షల వరకు 35 శాతం సబ్సిడీపై రుణాలు అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు గంధం సత్యకీర్తి, వెటర్నరీ అసిస్టెంట్ బళ్ల దుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సార్వా సాగు



మొగల్తూరు గొల్లగూడెంలో వేసిన ఆకుమడులు

మొగల్తూరు: మండలంలో సార్వా సాగు పనులు సాగుతున్నాయి. ప్రధాన కాలువలు సమయానికి వదిలేసినా ఇంకా శివారు ప్రాంతాలకు సాగు నీరు అందకపోవడం, వరుణుడు కూడా కరుణించకపోవడంతో వ్యవసాయ పనులు ప్రారంభం కాలేదు. అయితే గత కొద్ది రోజులుగా వర్షాలు పడుతుండటంతో చేలల్లో నీరు నిలవడంతో దుక్కులు దున్నే పనులు ప్రారంభించారు. అయితే మండలంలోని రామన్నపాలెం, శేరేపాలెం పంచాయతీ నవుడూరుగరువు, మొగల్తూరు, కేపీ పాలెం, పేరుపాలెం గ్రామాల్లో సార్వా సాగు చేపడుతుండగా, రామన్నపాలెం 2, మొగల్తూరు 2,3 సచివాలయాల పరిధిలో ముందుగా ఆకుమడులు వేసుకోవడంతో నాట్లు వేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మండలంలో సుమారు 1680 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని వ్యవసాయాధికారులు అంచనాలు వేయగా ఇప్పటివరకు 150 ఎకరాల్లో ఆకుమడులు వేశారని భావిస్తున్నారు. ఎంటీయూ 1029,1064,1061,1318 రకాల విత్తనాలు వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు. రైతులకు అవసరమయ్యే సలహాలు సూచనలు అందించేందుకు రైతు భరోసా కేంద్రంలో అధికారులు సిద్ధంగా ఉన్నారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రహీమ్ సూచిస్తున్నారు.

మహిళలు ఉన్నప్పుడు ఎలా మాట్లాడాలో తెలియదా?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: మహిళలు ఉన్నప్పుడు ఎలా మాట్లాడాలో తెలియని ఓ సంస్కారం లేని వ్యక్తి టీడీపీ సమావేశానికి ముఖ్య అతిథా? అని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ పేర్కొన్నారు. బుధవారం తాతాజీ తన కార్యాలయంలో విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుకి సమావేశంలో ఎలా మాట్లాడాలో? ఒక బాధ్యత కలిగిన పదవిలో ఉన్న వ్యక్తిని ఎలా గౌరవించాలో? మహిళలు ఉన్న సందర్భాల్లో ఏ వ్యాఖ్యలు చేయాలో? తెలియని వ్యక్తి అని విమర్శించారు. రామానాయుడుని రోల్ మోడల్‌గా తీసుకోవాలని అయ్యనపాత్రుడు సూచించడం సిగ్గుచేటన్నారు. రామానాయుడు 20 శాతం కమీషన్లు తీసుకుంటాడని, ప్రభుత్వ ఏ పని మొదలు పెట్టినా వాళ్ల నాయకులతో కోర్టుల్లో కేసులు వేయించి పనులు ముందుకు వెళ్లకుండా అడ్డుకట్ట వేయిస్తాడని, మళ్లీ అదే ప్రాంతాలకు వెళ్లి ఏ పనులు ప్రారంభించడం లేదని అబద్ధాలు వల్లిస్తాడని ఇలాంటి నాయకుడిని రోల్ మోడల్‌గా తీసుకోవాలని చెప్పడానికి సిగ్గు లేదా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెన్ను విజయ్, గంటా నరేష్, రేలంగి శ్రీను, పెచ్చెట్టి కృష్ణాజీ, పిల్లా అప్పాజీ, ఉనికెల శ్రీను, పాలపర్తి కృపానాథ్, జోగి వడ్డికాసులు, పిల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులపై వివక్ష తగదు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: వృద్ధులపై వివక్ష అంటే అది మానవ హక్కుల ఉల్లంఘనే అని నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, కమిషనర్ కె వెంకటేశ్వరరావు లు పేర్కొన్నారు. బుధవారం ది నర్సాపూర్ సీనియర్ సిటిజన్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సంఘ అధ్యక్షుడు అందే రంగారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిషర్ మాట్లాడుతూ వృద్ధులు అంటే భావితరాలకు అనుభవాల నిధి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెల్పేజ్ ఇండియా వారు ప్రవేశ పెట్టిన జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ నెంబర్ 14567 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. నెక్కంటి సుబ్బారావు, షేక్ సిలార్, పితాని సత్యనారాయణ, రామారావు, బాపూశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి



ఎంపీటీసీ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ సోని

నరసాపురం రూరల్: మండలపరిషత్, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ మైలాబత్తుల సోనీ అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ, ఎంపీటీసీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరసాపురం మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, కమ్యూటీ హాల్ భవనాలు తదితర వాటి నిమిత్తం ఖర్చు చేసేందుకు గానూ మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు పాల్గొన్నారు.